నైపుణ్యాభివృద్ధితో ఉపాధి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు (బారకాసు) : సేవారంగంలో నైపుణ్యాభివృద్ధి సాధిస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ సూచించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 'సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం పేస్– 1'ను కార్యాలయ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్రంగి, ప్లంబింగ్, కార్పెంటర్, గృహోపకారణాల రిపేరింగ్, బ్యూటీషియన్ తదితర సేవలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తామన్నారు. వృత్తిదారుల నమోదు కార్యక్రమాన్ని ఈనెల 7వ తేదీ వరకు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమం మెప్మా పీడీ రాధమ్మ, టీపీఆర్‌ఓ బాలకృష్ణ, టీఈలు అంకయ్య, కాంతయ్య పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీకి నివాళి

నెల్లూరు (బారకాసు) : స్థానిక కలెక్టర్ బంగ్లా సమీపంలోని పార్కులో లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి మేయర్ స్రవంతి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రెయిలీ లిపి ఆవిష్కరణతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంధులు మెరుగైన జీవితాన్ని గడుపుతున్నారని, అన్నిరంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. లూయిస్ బ్రెయిలీ జన్మదినాన్ని పురస్కరించుకుని జనవరి 4న ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు.

కృష్ణచైతన్యలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నెల్లూరు (టౌన్) : స్థానిక కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, కళాశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు 200 యూనిట్ల రక్తదానం చేశారన్నారు. డీన్‌లు సుధారాణి, రామాంజనేయులరెడ్డి, ప్రిన్సిపల్ నాగయ్య పాల్గొన్నారు.

మహిళా క్రీడాకారులకు అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో దర్గామిట్టలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులు సత్తా చూటారు. మహిళల విభాగంలో వాలీబాల్‌లో మొదటి స్థానం, ఖోఖోలో మొదటి స్థానం, చెస్‌లో మొదటి స్థానం, షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో మొదటి స్థానం, షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో మొదటి స్థానం సాధించారు. అలాగే టేబుల్ టెన్నిస్‌లో సింగిల్స్, డబుల్స్‌లో ద్వితీయ స్థానం సాధించారు. గేమ్స్ అథ్లెటిక్స్ టీమ్ చాంపియన్ షిప్, ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలు కైవసం చేసుకున్నారు. దీంతో వారిని శనివారం కళాశాలలో ప్రిన్సిపల్ ఏసుదాసు, పీడీ వెంకటేశ్వరరావులతో పాటు ఎలక్ట్రానిక్స్ విభాగం హెచ్‌ఓడీ నజీర్ అహ్మద్, సీఎంఈ విభాగపు హెచ్‌ఓడీ పాపమ్మ, సీసీపీ గ్రూపు హెచ్‌ఓడీ అనూరాధ, జనరల్ హెడ్ విశ్వేశ్వరి ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : క్రీడలతో దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నెహ్రూ యువకేంద్రం, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నెల్లూరు బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు నిర్వహించారు. దీనిని ఆయన ప్రారంభించి, విజేతలకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు, ట్రోఫీని అందజేశారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

నెల్లూరు (బారకాసు) : స్థానిక మున్సిపల్ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ సూర్యతేజ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలేజీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, నెల్లూరు ఎంఈఓ తిరుపాల్, ప్రిన్సిపాల్ ఎస్. శివరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూలో..

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మాజీ మేయర్ భానుశ్రీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఆర్‌ఐఓ శ్రీనివాసులు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమణారావు, హెచ్ఎం పార్థసారథి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, కొండయ్య, చంద్రకళ, కరుణకుమారి, శ్రీదేవి, ప్రసన్న, భారతి, కృష్ణతులసి, పూర్ణచంద్రకుమారి, విశ్రాంత అధ్యాపకులు కుసుమకుమారి పాల్గొన్నారు.

చలికాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



నెల్లూరు(అర్బన్) : చలికాలంలో ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కన్సల్టెంట్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ కె.పెంచలప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆస్పత్రిలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా పోషకాలను బ్యాలెన్స్ చేసుకుని వ్యాధులు రాకుండా చూసుకోవచ్చన్నారు. శరీరానికి సరిపడా నీరు, ద్రవ పదార్థాలు తీసుకోవడం మంచిదన్నారు. ఇండోర్‌లోనే ఉండి వ్యాయామాలు చేయాలన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



నెల్లూరు (టౌన్) : స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో స్మాలర్ స్కాలర్స్ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ పద్మజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

6న ఎడ్యుకేషన్ ఫెయిర్

నెల్లూరురూరల్ : స్థానిక జెట్టి శేషారెడ్డి ఫంక్షన్ హాల్‌లో 6న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ జరుగుతుందని ఆర్గనైజింగ్ కన్వీనర్ వాసుదేవరెడ్డి తెలిపారు. జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఆయన శనివారం మాట్లాడారు. ఇందులో వివిధ వర్సిటీల సిబ్బందితో మాట్లాడుకునే అవకాశం ఉందని వివరించారు.

వాణిజ్య, వ్యాపార కేంద్రాల కూడలి సింహపురి

నెల్లూరు(బారకాసు) : విద్య, వైద్యంతో పాటు ఇతర వ్యాపార రంగాలు రోజురోజుకు పుంజుకుంటుండడంతో నెల్లూరు నగరం (సింహపురి) వ్యాపార రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఇతర ప్రాంతాలతో పోల్చితే రియల్ ఎస్టేట్‌తో పాటు బంగారం, సిమెంట్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ ఇలా అనేక రకాల వ్యాపారాల్లో సింహపురి ముందుకు దుసుకెళ్తోంది.

విద్యారంగం..

నెల్లూరు నగరం విద్యారంగంలో ముందంజలో ఉంది. ఇక్కడ వందల సంఖ్యలో ప్రైవేట్ విద్యాసంస్థలున్నాయి. ముఖ్యంగా పేరెన్నిక కలిగిన ప్రముఖ విద్యా సంస్థలు సెంట్రల్ సిలబస్‌కు నిలయాలు.

ఆభరణాల తయారీకి కేంద్రం..

బంగారు ఆభరణాల తయారీకి కూడా పెట్టింది పేరు సింహపురి పట్టణం. నిత్యం ఇక్కడ బంగారం విక్రయాలు రూ.కోట్లలో జరుగుతుంటాయి. అంతేకాకుండా పట్టణంలోని బంగార దుకాణాల మండపాలవీధి ఎంతో ప్రసిద్ధి. ఆభరణాల తయారు చేసే వారిలో అన్ని వర్గాల వారు ఉండటం మరో విశేషం. ఇక్కడి జ్యూవెలరీ షాపులు ఉదయం నుంచి రాత్రి వరకు కస్టమర్లతో కళకళలాడుతూ ఉంటాయి.

రియల్ ఎస్టేట్ రంగం..

నగరంలో రియల్ ఎస్టేట్ రంగం ఆశాజనకంగా ఉంది. నగరం రోజు రోజుకు విస్తరిస్తోంది. కాగా మినీబైపాస్‌రోడ్డు, పొదలకూరు రోడ్డు, కొత్తూరు, మైపాడు రోడ్డు, నాలుగో మైలు, ధనలక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో వెంచర్ల ఏర్పాటుతో వాటిలో అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలు జరగడంతో ఆయా ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. ప్రజలకు అన్ని సౌకర్యాలకు అందుబాటులో ఉండేలా రియల్టర్లు వెంచర్స్ వేయడంతో అనేక మంది ఇందులో ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అలాగే పలు కన్వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వాటిలో అహ్లాదకరమైన వాతావరణంతో, అత్యాధునిక వసతులు ఏర్పాటు చేశారు. వివాహాది శుభకార్యాలు, జన్మదిన వేడుకలు, కిట్టీ పార్టీలు, గెట్ టు గెదర్, మినీ ఫంక్షన్స్‌ను అందుబాటు ధరలో ఆనందంగా జరుపుకునేందుకు వీలుగా ఉన్నాయి.

ప్రముఖ వస్త్ర దుకాణాలు..

చెన్నై, హైదరాబాద్, విజయవాడ లాంటి మహానగరాల్లో ఉన్న పెద్ద పెద్ద వస్త్ర దుకాణాలు వాటి షోరూమ్‌లను నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డు (జీఎన్‌టీరోడ్డు), కాపువీధి, మినీ బైపాస్‌రోడ్డులో ఏర్పాటు చేశాయి. అలాగే ఎలక్ట్రానిక్స్ రంగానికి సంబంధించి అనేక షోరూంలు ఉన్నాయి. వస్త్ర దుకాణాలతో పాటు షూ మార్టులు అనేకం ఉన్నాయి.

వైద్య రంగంలో...

నెల్లూరు నగరంతో పాటు జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రజలకు కూడా కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యం అందుతోంది. చెన్నై, హైదరాబాద్, విజయవాడ వంటి మహా నగరాల్లోని పెద్ద పెద్ద కార్పొరేట్ హాస్పిటల్స్‌కు చెందిన నిష్ణాతులైన వైద్యులు నెల్లూరు నగరంలోని పలు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు.

ఆటోమొబైల్ రంగంలోనూ..

పలు ఆటో మొబైల్ కంపెనీలకు చెందిన షోరూంలతో పాటు కార్లకు సంబంధించి షోరూంలు నగరానికి సమీపంలోనే ఉన్నాయి.

నిత్యావసర సరుకులు...

నిత్యావసర సరుకులు అందరికీ అందుబాటులో లభించేలా నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, రేబాలవారి వీధి పెట్టింది పేరు. ఈ ఏరియాలో అన్నిరకాల నిత్యావసర సరుకులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

హౌస్ హోల్డ్ డేటాలో నమోదు కావాలి

నెల్లూరు (బారకాసు) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరులందరూ హౌస్ హోల్డ్ డేటా బేస్‌లో నమోదై ఉండాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

నెల్లూరు (టౌన్) : స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేదాయపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి, ఫౌండేషన్ నిర్వాహకుడు సురేంధర్‌రెడ్డి, హెచ్ఎం కృష్ణారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ భార్గవి, వ్యాయామ ఉపాధ్యాయులు విజయకుమార్, పార్వతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాలకొండకు బస్సు సౌకర్యం

నెల్లూరు సిటీ : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధైన మాలకొండకు బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ నెల్లూరు–1 డిపో మేనేజర్ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం, కనిగిరి, కొండాపురం మీదుగా ప్రతి శనివారం బస్సు వెళ్తుందన్నారు.

వార్డు సచివాలయాల సందర్శన

నెల్లూరు (బారకాసు) : నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య 28/2, 28/3 వార్డు సచివాలయాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వినతి

నెల్లూరురూరల్ : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని సీమాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందిటి సుబ్బయ్య శనివారం ఏకసభ్య కమిషన్ చైర్మన్ రంజన్ మిశ్రాకు కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు.

నేత్రదానం

నెల్లూరు(అర్బన్) : నగరంలోని కుక్కలగుంట–ఆనం వెంకటరెడ్డి కాలనీలో బి.రాజినమ్మ(68) శనివారం మృతిచెందారు. నేత్రదాత మోటివేటర్ బయ్యా ప్రసాద్ సహకారంతో ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్ ఆమె నేత్రాలను సేకరించారు. అనంతం కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు.

• స్థానిక నవాబుపేటకు చెందిన మారిశెట్టి నాగరాజయ్య(79) ప్రభుత్వ పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిరంజీవి ఐ బ్యాంక్ సంస్థ అధ్యక్షుడు సుధీర్ సహకారంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. ఐ టెక్నీషియన్ సునీల్ మృతుని నేత్రాలను సేకరించారు.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

నెల్లూరు(బారకాసు) : జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వైస్ చైర్మన్ సూర్యతేజతో కలిసి నుడా కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. అనంతరం నుడా మీడియాతో మాట్లాడుతూ 2041 టార్గెట్‌గా పరిశ్రమల స్థాపన, రోడ్లు, డ్రెయినేజీ వంటి వసతుల కల్పనకు మాస్టర్ ప్లాన్ అవసరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ హిమబిందు పాల్గొన్నారు.

ఘంటసాల, మహ్మద్ రఫీ జయంతి నేడు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరంలో ఆదివారం ఘంటసాల వెంకటేశ్వరరావుతో పాటు మహ్మద్ రఫీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు శాంతికల్చరల్స్ అధ్యక్షుడు పి.అమానుల్లాఖాన్ తెలిపారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను శనివారం పురమందిరం ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్ధమాన గాయకులకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు. కేతా సుబ్బారావు, ఎం.గోవర్ధన్, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.